# నమస్తే తెలంగాణ
# రంగారెడ్డి
I | హైదరాబాద్, శనివారం 15 ఫిబ్రవరి 2025 | RANGAREDDY


## కేసీఆర్‌పై విమర్శలు తగవు

**మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి**



సిటీబ్యూరో, ఫిబ్రవరి 14 : ఏ ఒక్క రోజు కూడా తెలంగాణ జెండా పట్టని రేవంత్‌రెడ్డికి తెలంగాణ ఉద్యమ నేత, మాజీ సీఎం కేసీఆర్‌ను విమర్శించే స్థాయి, నైతిక హక్కు లేదని మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి అన్నారు. 14 ఏండ్లపాటు తెలంగాణ కోసం అలుపెరుగని పోరాటం చేసిన ఉద్యమ నాయకుడిపై ఆరోపణలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. కేసీఆర్ చావు నోట్లో తలపెట్టి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారని గుర్తు చేశారు. తెలంగాణ జెండానే పట్టని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి త్యాగాలు చేసిన వ్యక్తులను విమర్శించే స్థాయి లేదన్నారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజలు చాలా సంతోషంగా ఉన్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాతే ప్రజలు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని.. ప్రజాపాలన పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం 14 నెలల్లో చేసింది గుండు సున్నా అని ఎద్దేవా చేశారు. పాలనను గాలికి వదిలేసి బీఆర్ఎస్ నాయకులను విమర్శించడమే పనిగా సీఎం, మంత్రులు పెట్టుకున్నారని ఆరోపించారు.



రంగారెడ్డి జిల్లాలో ఉన్న ఔటర్ రింగ్ రోడ్డు

## నెల రోజుల్లో ఇంటి నిర్మాణాన్ని ప్రారంభించాలని నిబంధన

# కాసులివ్వకుండానే కండీషన్లా..?

- లేకుంటే మరొకరిని ఎంపిక చేస్తారని గ్రామాల్లో జోరుగా ప్రచారం
- పైలట్ గ్రామాల్లో లబ్ధిదారులుగా ఎంపికైన వారికి ప్రభుత్వం షరతులు
- ప్రభుత్వం తీరుపై భగ్గుమంటున్న లబ్ధిదారులు
- రూపాయి ఇవ్వకుండానే ఇండ్లు నిర్మించాలంటే ఎలా అని మండిపాటు
- మండలానికి ఒక గ్రామాన్ని పైలట్‌గా ఎంపిక
- వికారాబాద్ జిల్లాలోని 20 మండలాల్లో 2,832 మంది..
- జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల పథకానికి అర్హులు 1,70,000 మంది



గత నెల 26న రేవంత్ సర్కార్ ఎంతో ఆర్భాటంగా రేషన్‌కార్డులు, ఆత్మీయభరోసా, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్ల పథకాలను ప్రారంభించింది. అయితే, అందులో ఇందిరమ్మ ఇండ్ల పథకానికి సంబంధించి మండలానికి ఒక గ్రామాన్ని పైలట్‌గా ఎంపిక చేసి అక్కడి లబ్ధిదారులకు ప్రొసీడింగ్ కాపీలను అందించింది. ఈ విధంగా జిల్లాలోని 20 మండలాల్లోని 20 గ్రామాల్లో 2,832 మంది లబ్ధిదారులకు పత్రాలను ఇచ్చింది. లబ్ధిదారులకు ప్రొసీడింగ్ కాపీలు ఇచ్చి దాదాపుగా 20 రోజులు దాటుతున్నా పైసా నిధులను ప్రభుత్వం కేటాయించలేదు. కాగా, పైలట్ గ్రామాల్లోని లబ్ధిదారులు నెల రోజుల్లోగా ఇంటి నిర్మాణాన్ని ప్రారంభించాలని లేకుంటే, మరొకరిని లబ్ధిదారులుగా ఎంపిక చేస్తామని షరతు విధించడంతో వారు ప్రభుత్వం తీరుపై భగ్గుమంటున్నారు. కాసులివ్వకుండా కండీషన్లు ఎలా పెడతారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**-వికారాబాద్, ఫిబ్రవరి 14 (నమస్తే తెలంగాణ)**

కాంగ్రెస్ సర్కార్ అమల్లోకి తీసుకొచ్చిన ప్రతి సంక్షేమ పథకంలోనూ ఏదో ఒక కొర్రీ పెడుతున్నది. రుణమాఫీ మొదలుకొని గతనెల 26న అమల్లోకి తీసుకొచ్చిన రేషన్‌కార్డులు, ఆత్మీయభరోసా, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్ల పథకాల వరకు చాలా మంది అర్హులకు ఏదో విధంగా మొండిచెయ్యి చూపుతున్నది. ఇందిరమ్మ ఇండ్ల పథకానికి సంబంధించి మండలానికి ఒక గ్రామాన్ని పైలట్‌గా ఎంపిక చేసి అక్కడ లబ్ధిదారులను గుర్తించారు. ఈ విధంగా జిల్లాలోని 20 మండలాల్లోని 20 గ్రామాల్లో 2,832 మంది లబ్ధిదారులను అర్హులుగా ఎంపిక చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం వారికి ప్రొసీడింగ్ కాపీలను అందించింది. కాగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఒక్కో లబ్ధిదారుడికి విడతల వారీగా రూ.5 లక్షల ఆర్థిక సాయాన్ని అందించాలని సర్కార్ నిర్ణయించింది. అయితే, ఇంతవరకు బాగానే ఉన్నా.. అర్హులకు దాదాపుగా 20 రోజులు కావొస్తున్నా ప్రొసీడింగ్ కాపీలు తప్పా పైసా నిధులు కేటాయించకపోవడం గమనార్హం. లబ్ధిదారులకు నిధులివ్వడం మరిచిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రొసీడింగ్స్‌తోపాటు షరతులను విధించింది.

పైలట్ గ్రామాల్లో లబ్ధిదారులు నెల రోజుల్లోగా ఇంటి నిర్మాణాన్ని ప్రారంభించాలని నిబంధన పెట్టింది. ఒకవేళ లబ్ధిదారులు ఇంటి నిర్మాణం ప్రారంభించకుంటే మరొకరిని లబ్ధిదారులుగా ఎంపిక చేస్తారంటూ ప్రచారం గ్రామాల్లో జోరుగా సాగుతున్నది. దీంతో ఇందిరమ్మ ఇండ్ల పథకానికి లబ్ధిదారులుగా ఎంపికైన వారు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేస్తుంది. రూపాయి ఇవ్వకుండా షరతులు పెట్టడం ఏమిటని ప్రభుత్వాన్ని జిల్లాలోని ప్రజలు నిలదీస్తున్నారు. కాసులివ్వకుండా కండిషన్స్ ఎలా పెడతారంటూ స్థానిక కాంగ్రెస్ నాయకులను నిలదీస్తుండడంతో వారు మొహం చాటేస్తున్నారు.

### పైలట్ గ్రామాలతోనే సరి..

ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని కాంగ్రెస్ సర్కార్ కేవలం పైలట్ గ్రామాలతోనే సరిపెట్టింది. మండలానికి ఒక గ్రామాన్ని పైలట్‌గా ఎంపిక చేసి లబ్ధిదారులకు ప్రొసీడింగ్ కాపీలను అందించింది. దాదాపుగా 20 రోజులు గడిచినా తదుపరి లబ్ధిదారుల ఎంపికపై నిర్ణయం తీసుకోకపోవడంతో వేలాది మంది అర్హులు ప్రభుత్వం తీరుపై మండిపడుతున్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు మేము అధికారంలోకి రాగానే ఇల్లులేని వారందరికీ ఇందిరమ్మ ఇండ్లు కేటాయిస్తామని హామీ ఇచ్చి.. గద్దెనెక్కిన రేవంత్‌రెడ్డి.. ప్రస్తుతం ఒక్కో గ్రామాన్ని ఎంపిక చేస్తుండడంతో ప్రజలు, మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కేవలం మండలానికి ఒక్క గ్రామాన్ని మాత్రమే.. అది కూడా తక్కువ జనాభా ఉన్న గ్రామాలను ఎంచుకుని.. లబ్ధిదారులకు ప్రొసీడింగ్ కాపీలను అందించారని పలువురు ఆరోపిస్తున్నారు.

కాగా, జిల్లాలో అర్హులైన వారు 1,70,000 మంది వరకు ఉండగా కేవలం 2,832 మందిని మాత్రమే ఇందిరమ్మ ఇండ్ల పథకానికి లబ్ధిదారులుగా ఎంపిక చేసి.. ఊరూరా కాంగ్రెస్ ప్రభుత్వం గొప్పగా ప్రచారం చేసుకుంటుండడంపై జిల్లా అంతటా అసంతృప్తి వ్యక్తం అవుతున్నది.

ప్రభుత్వం నియోజకవర్గానికి 3,500 ఇండ్లను మంజూరు చేయగా, ప్రజాపాలనతోపాటు గతంలో స్వీకరించిన వాటిలో 2,50,000 దరఖాస్తులుండగా, వాటిలో 1,70,000 దరఖాస్తుదారులను అర్హులుగా తేల్చారు. వారేకాకుండా గత నెలలో నిర్వహించిన గ్రామ, వార్డు సభల్లోనూ అర్హులైన వారు దరఖాస్తు చేసుకున్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకానికి జిల్లావ్యాప్తంగా గ్రామ సభల్లో 26,312 దరఖాస్తులు రాగా.. అయితే వాటి పరిశీలనకు సంబంధించి ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడం గమనార్హం.

# విస్తరిస్తున్న హెచ్‌ఎండీఏ

## పెరుగుతున్న పట్టణీకరణతో దాని ఆధీనంలోకి వెళ్తున్న రంగారెడ్డి జిల్లాలోని పలు మండలాలు

- ఉనికిని కోల్పోతున్న జిల్లా
- ఇప్పటికే జిల్లాలోని 22 మండలాలు హెచ్‌ఎండీఏ పరిధిలోకి
- కొత్తగా మరో 6 మండలాలను కలపాలని యోచన

**ఇప్పటికే ప్రభుత్వానికి ప్రతిపాదనలు**

రంగారెడ్డి, ఫిబ్రవరి 14 (నమస్తే తెలంగాణ) : నైసర్గిక స్వరూపం రోజురోజుకూ మారుతుండడంతో జిల్లా ఉనికి ప్రశ్నార్థకంగా మారుతున్నది. ఇప్పటికే జిల్లాను వికారాబాద్, మేడ్చల్ జిల్లాలుగా విభజించారు. జిల్లాలోని శివారు ప్రాంతాలన్నింటినీ మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లుగా మార్చడంతోపాటు వాటిని హైదరాబాద్ మహానగర పాలక సంస్థలో కలిపే పనులు చురుగ్గా సాగుతున్నాయి. అలాగే, జిల్లాలో ఉన్న గ్రామపంచాయతీలను మున్సిపాలిటీలుగా మార్చడంతో ఇప్పటికే జిల్లాలో సగానికి పైగా పంచాయతీలు మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పరిధిలోకి వెళ్లాయి. దీంతో జిల్లాలో ఏ ప్రాంతం ఎక్కడ ఉంటుందో..? ఏ మున్సిపాలిటీ పరిధిలోకి వస్తుందో తెలియని అయోమయ పరిస్థితి ఏర్పడింది.



### మారుతున్న జిల్లా స్వరూపం..

పెరుగుతున్న పట్టణీకరణ, హైదరాబాద్ మహానగరం రోజురోజుకూ విస్తరిస్తుండడంతో జిల్లా స్వరూపం మారిపోతున్నది. గతంలో జిల్లాను వికారాబాద్, మేడ్చల్ జిల్లాలుగా విభజించారు. ఆ తర్వాత జిల్లాలోని శివారు ప్రాంతాలన్నింటినీ మున్సిపాలిటీలుగా మార్చారు. వాటిని హైదరాబాద్ నగరపాలక సంస్థలో కలపాలని యోచిస్తున్నారు. మారుతున్న సమీకరణలతో జిల్లా నైసర్గిక స్వరూపం వడివడిగా మారిపోతున్నది.

### హెచ్‌ఎండీఏ పరిధిలోకి..

జిల్లాను క్రమంగా హెచ్‌ఎండీఏ తన ఆధీనంలోకి తీసుకుంటున్నది. గతంలో జిల్లాలో ఉన్న 22 మండలాలు దాని పరిధిలోకి వెళ్లిపోయాయి. ప్రస్తుతం ఉన్న 21 మండలాల్లో ఆరు మండలాలనూ హెచ్‌ఎండీఏ తన ఆధీనంలోకి తీసుకునేందుకు ప్రయత్నాలు మొదలెట్టింది. రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) ఏర్పాటవుతున్న నేపథ్యంలో ఆర్ఆర్ఆర్ పరిధిలో ఉన్న అనేక మండలాలను తన పరిధిలోకి తీసుకుంటున్నది. ఇబ్రహీంపట్నం, అబ్దుల్లాపూర్‌మెట్, హయత్‌నగర్, కందుకూరు, రాజేంద్రనగర్, బాలాపూర్, గండిపేట, చేవెళ్ల, మొయినాబాద్, శంకర్‌పల్లి, శంషాబాద్, మంచాల, యాచారం, షాద్‌నగర్, పారుఖ్‌నగర్, మహేశ్వరం, శేరిలింగంపల్లి తదితర మండలాలు హెచ్‌ఎండీఏ పరిధిలో ఉన్నాయి.

### మారనున్న గ్రామీణ ప్రాంతాల రూపురేఖలు..

ఇప్పటివరకు గ్రామీణ ప్రాంతాలతో ఉన్న జిల్లా ఇక నుంచి హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలోకి వెళ్లనున్నది. జిల్లాలోని అన్ని మండలాలు హెచ్‌ఎండీఏ పరిధిలోకి వెళ్లనుండడంతో అనుమతులు, ట్యాక్సీలు ఇతరత్రా అన్ని మౌలిక వసతులూ హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీలోకి రానున్నాయి. భూముల మార్కెట్ విలువ పెరగడంతోపాటు అనుమతుల విలువ కూడా హెచ్‌ఎండీఏ నుంచే రానున్నాయి. అలాగే, ఆయా మండలాలు హెచ్‌ఎండీఏ ఆధీనంలోకి వెళ్లనుండడంతో వాటిలో అధికంగా మౌలిక వసతులు సమకూరనున్నాయి.

### కొత్తగా ప్రతిపాదనలున్న మండలాలు..

జిల్లా పరిధిలోని రీజినల్ రింగ్‌రోడ్డు (ఆర్ఆర్ఆర్) లోపల ఉన్న మాడ్గుల, కడ్తాల్, తలకొండపల్లి, కేశంపేట మండలాలను హెచ్‌ఎండీఏ తన పరిధిలోకి తీసుకోవాలని చూస్తున్నది. ఈ మేరకు ప్రభుత్వానికి ఇప్పటికే ప్రతిపాదనలను పంపించింది. హెచ్‌ఎండీఏ నిర్ణయంతో ఇక నుంచి జిల్లాలోని అన్ని మండలాలు హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలోకి రానున్నాయి.

# ప్రాణాలు పోతున్నా.. పట్టించుకోరా..?

- బీఆర్ఎస్ పార్టీ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్
- ఎస్టీ హాస్టల్‌లో మృతి చెందిన విద్యార్థి దేవేందర్ కుటుంబీకులకు పరామర్శ



విద్యార్థి దేవేందర్ కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆనంద్

వికారాబాద్, ఫిబ్రవరి 14 : గురుకుల విద్యార్థుల ప్రాణాలతో ప్రభుత్వం ఆడుకుంటున్నదని బీఆర్ఎస్ పార్టీ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ మండిపడ్డారు. కులకచర్ల మండల కేంద్రంలోని గిరిజన హాస్టల్‌లో ఉంటూ టెన్త్ చదువుతున్న మద్దుల్‌చిట్టంపల్లి అనుబంధ గ్రామం టేకులబీడుతండాకు చెందిన విద్యార్థి దేవేందర్ అనుమానాస్పదంగా మృతి చెందగా.. శుక్రవారం మాజీ ఎమ్మెల్యే ఆనంద్.. అతడి ఇంటికెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి మాట్లాడుతూ.. విద్యార్థి మృతి తనను కలచివేసిందని.. ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఓ పేద విద్యార్థి మరణించాడని మండిపడ్డారు. విద్యావ్యవస్థలో పర్యవేక్షణ లోపించిందని, చదువుకునే పిల్లలకు కూడా ప్రభుత్వం రక్షణ కల్పించడంలో విఫలమైందన్నారు. ప్రతిరోజూ కల్తీ ఆహారం తింటూ చస్తున్నామని.. మంచి భోజనం పెట్టాలని విద్యార్థులు రోడ్లపైకి వచ్చి ఎన్ని ధర్నాలు చేసినా..ఎంత మొత్తుకున్నా... ఈ ప్రభుత్వానికి చలనం లేదని.. ఇంకా ఎంతమంది చనిపోతే పట్టించుకుంటామని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొన్ని వసతి గృహాల్లో విద్యార్థులు పాము, తేలు, ఎలుక కాట్లకు గురవుతున్నారని.. మరికొన్ని హాస్టళ్లలో కనీసం ఎందుకు చనిపోతున్నారో కూడా తెలియలేని దారుణ పరిస్థితులు నెలకొన్నాయన్నారు. తాండూరు గిరిజన బాలికల హాస్టల్‌లో ఫుడ్ పాయిజన్ జరిగి 15 మంది విద్యార్థినులు ఆస్పత్రి పాలైన ఘటనలు ఈ సర్కార్ నిర్లక్ష్యంతో జరుగుతూనే ఉన్నాయన్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ వికారాబాద్ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ గోపాల్, నాయకులు నర్సింహులు, గ్రామ కమిటీ అధ్యక్షుడు లక్ష్మయ్య, మల్లయ్య, మాణేయ్య, రఫీ, కిష్టయ్య, రాములు పాల్గొన్నారు.

# హెచ్‌ఎండీఏ భూమికి ఎసరు

## రక్షణగా నియమిస్తే కబ్జా కథ నడుపుతున్న సెక్యూరిటీ గార్డు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 14 : కంచె చేను మేసిన చందంగా తయారైంది... ఆ హెచ్‌ఎండీఏ భూమి తీరు. విలువైన స్థలాన్ని కాపాడేందుకు అధికారులు కాపలాగా ఓ సెక్యూరిటీ గార్డును నియమిస్తే అతడే ఆ భూమి కబ్జా కథను నడిపిస్తుండడం గమనార్హం. మియాపూర్‌లో హెచ్‌ఎండీఏకు సంబంధించి భారీ విస్తీర్ణంలోనే భూములు ఉన్నాయి. సర్వేనంబర్ 100లో ఉన్న భూముల్లో కొంతకాలం కిందట వివిధ జిల్లాల నుంచి వచ్చిన నిరుపేదలు పెద్ద ఎత్తున గుడిసెలు వేసేందుకు సిద్ధం కావడం... చివరకు పోలీసుల సహకారంతో హెచ్‌ఎండీఏ అధికారులు వారిని వెనక్కి పంపించడం తెలిసిందే. ఈ క్రమంలో దానికి సమీపంలోనే సర్వేనంబర్ 20, 21ల్లోనూ సుమారు 2500 చదరపు గజాల స్థలం ఉన్నది.

మియాపూర్-బొల్లారం రహదారికి అనుసరించి ఉండడంతో ఈ భూమి విలువ గజం దాదాపు రూ.2 లక్షల వరకు ఉంటుందని అంచనా. ఈ నేపథ్యంలో హెచ్‌ఎండీఏ ఉన్నతాధికారులు ఆ భూమికి రక్షణగా ఒక సెక్యూరిటీ గార్డును నియమించారు. అతడు అక్కడే చిన్నపాటి గుడిసెలను వేయించడంతోపాటు హోటల్ వంటి చిన్నపాటి వ్యాపారాలకు షెడ్లు వేసేందుకు సహకరించాడు. అంతేకాదు వారి నుంచి ప్రతినెలా అద్దె కూడా తీసుకుంటున్నట్లు సమాచారం. వాస్తవానికి ఈ విషయం హెచ్‌ఎండీఏ అధికారులకు తెలియకుండా ఉండదు. కానీ, వారు ఎందుకు పట్టించుకోవడంలేదనేది సందేహాలకు కారణమైనది.

ఇదే అదునుగా భావించిన సదరు సెక్యూరిటీ గార్డు ఒక మహిళతో జీవో 59 కింద దరఖాస్తు చేయించి ఆ స్థలాన్ని కాజేసేందుకు పావులు కదుపుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ తతంగంలో కొందరు స్థానిక నేతల హస్తం కూడా ఉందనే ఆరోపణలున్నాయి.



# ఇంకెప్పుడు ఇస్తారు..?

- అదును దాటిపోతున్నా అందని బోనస్ డబ్బులు
- 5 నెలలు అవుతున్నా రైతుల ఖాతాల్లో జమకాని వైనం
- రంగారెడ్డి జిల్లాలో కోటికి పైగా బకాయిలు

యాసంగి సీజన్ పూర్తి కావొస్తున్నప్పటికీ ప్రభుత్వం నుంచి జిల్లాలోని రైతులకు రావాల్సిన రూ. 500 బోనస్ మాత్రం అందడం లేదు. ప్రభుత్వం గత వానకాలంలో జిల్లాలో 38 కొనుగోలు కేంద్రాల ద్వారా పదివేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించగా.. అందులో సుమారు ఆరు వేల మెట్రిక్ టన్నుల సన్న వరి ధాన్యం ఉన్నది. ఇందుకుగాను బోనస్ డబ్బులు రూ.2.88 కోట్లు రైతులకు అందాల్సి ఉండగా.. కేవలం రూ. 1.33 కోట్లు మాత్రమే చెల్లించింది. మిగిలిన రూ.1.50 కోట్ల కోసం అన్నదాతలు వెయ్యి కండ్లతో ఎదురు చూస్తున్నారు. అదును దాటిపోతున్నా డబ్బులు బ్యాంకు ఖాతాల్లో జమ కాకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

**-రంగారెడ్డి, ఫిబ్రవరి 14 (నమస్తే తెలంగాణ)**

ఆరుగాలం కష్టపడి పండించిన పంటలకు మద్దతు ధరతోపాటు బోనస్‌గా క్వింటాల్‌కు రూ.500 ఇస్తామని రేవంత్ సర్కార్ ప్రకటించింది. దీంతో జిల్లాలోని 1,971 మంది అన్నదాతలు 38 కేంద్రాల్లో సుమారు 10,000 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని విక్రయించారు. అందులో సుమారు 6,000 మెట్రిక్ టన్నుల వరకు సన్న వడ్లు ఉన్నాయి. వాటికి బోనస్‌గా రూ.2.88 కోట్లు రైతులకు రావాల్సి ఉన్నది. అయితే ప్రభుత్వం కేవలం రూ. 1.33 కోట్లు మాత్రమే చెల్లించింది. మిగిలిన రూ.1.50 కోట్ల కోసం అన్నదాతలు ఎదురు చూస్తున్నారు. ఆ డబ్బులు వస్తే యాసంగి పెట్టు బడికి ఉపయోగపడుతుందని భావిస్తున్నారు.

### బీఆర్ఎస్ ప్రభుత్వంలో సకాలంలో రైతుబంధు..

రైతును రాజుగా మార్చాలన్న సంకల్పంతో బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుబంధు పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకం ద్వారా ఏడాదికి ఎకరానికి రూ.10 వేల చొప్పున పంచన్‌గా పెట్టుబడి సాయం అందేది. దీంతో అన్నదాతలు సకాలంలో విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసి పంటలను సాగు చేసేవారు. అయితే రేవంత్ సర్కార్ రైతుబంధు పథకాన్ని రైతు భరోసాగా మార్చి.. ఏటా ఎకరాకు రూ. 12 వేల చొప్పున పంపిణీ చేస్తామని ప్రకటించింది. గత వానకాలంలో అన్నదాతలకు రైతుభరోసా పెట్టుబడి సాయాన్ని ఎగ్గొట్టింది. వ్యవసాయ యోగ్యం కావనే సాకుతో జిల్లాలో సుమారు 50,200 ఎకరాలకు పైగా రైతుభరోసాను నిలిపేయడంతో దాదాపుగా 30,000 మంది అన్నదాతలు ఇబ్బందిపడుతున్నారు. అర్హులందరికీ రైతు భరోసా అందించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

### రూ.1.50 కోట్ల బకాయిలు..

జిల్లాలో సన్న వడ్లు విక్రయించిన సుమారు 5,000 మంది వరకు రైతులకు ప్రభుత్వం బోనస్ కింద రూ.1.50 కోట్లు చెల్లించాల్సి ఉన్నది. గత నాలుగైదు నెలలుగా బోనస్ డబ్బుల కోసం వారు నిరీక్షిస్తున్నారు. ఆ డబ్బులొస్తే యాసంగి సాగుకు వినియోగించుకోవచ్చునని ఆశగా ఎదురుచూస్తున్నారు.

### కాంగ్రెస్ సర్కార్ రైతులను మోసం చేస్తున్నది..



కాంగ్రెస్ పాలనలో రైతులు మనోవేదనకు గురవుతున్నారు. ప్రభుత్వం సన్న వడ్లకు ఇస్తానన్న బోనస్ డబ్బులు ఇంకా రాలేదు. నేను 140 క్వింటాళ్ల సన్న వడ్లను కడ్తాల్ పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో విక్రయించా. 90 రోజులు దాటినా బోనస్‌కు సంబంధించిన రూ.70 వేలు నా బ్యాంకు ఖాతాలో ఇంకా జమ కాలేదు. రైతుల విషయంలో కాంగ్రెస్ సర్కార్ ప్రతిసారీ మాట తప్పి మోసం చేస్తున్నది.

**-గోరేటీ వెంకటేశ్‌యాదవ్, రైతు, కడ్తాల్**

### వెంటనే బోనస్ డబ్బులు చెల్లించాలి

ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించినట్లు రైతులకు బోనస్ కింద వెంటనే రూ.500 చెల్లించాలి. ఎన్నికల ముందు అలవి కాని హామీలు ఇచ్చి ..పవర్‌లోకి రాగానే వాటిని కాంగ్రెస్ నాయకులు పట్టించుకోకుండా.. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. అన్నదాతలకు ధోకా చేస్తున్నారు. ఇచ్చిన హామీలనింటినీ నెరవేర్చాలి.

**-మొగిలి వెంకటేశ్**



### రైతులను సర్కార్ దగా చేస్తున్నది..

సన్న వడ్లను ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయించిన 48 గంటల్లోనే రైతన్నల బ్యాంకు ఖాతాల్లో బోనస్ డబ్బులు జమ చేస్తామని ప్రగల్భాలు పలికిన కాంగ్రెస్ సర్కార్ ఇప్పటివరకు డబ్బులను జమ చేయలేదు. బోనస్ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను దగా చేసింది.

**-రమేశ్‌నాయక్, యువ రైతు, ఆమనగల్లు**

